ప్రాంతేతరులకు ఉద్యోగాలు ఎలా ఇస్తారు?

- ఎంఏయూడీలో కర్నూలు వ్యక్తి ఉద్యోగమా?
- తెలంగాణ బిడ్డల పొట్టకొడితే ఉద్యమిస్తాం
- మండలి చైర్మన్‌కు ఎమ్మెల్సీ కవిత లేఖ

హైదరాబాద్, ఫిబ్రవరి 12 (నమస్తే తెలంగాణ): నీళ్లు, నిధులు, నియామకాల కోసం ఏర్పడిన తెలంగాణలో ఆంధ్రప్రాంతం వారికి ఉద్యోగాలు ఎలా ఇస్తారని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మండలిలో నిలదీశారు. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్ (ఎంఏయూడీ) విభాగంలో ఏపీలోని కర్నూలుకు చెందిన ఏ రామిరెడ్డి కుమారుడు రఘునాథ్‌రెడ్డికి ఉద్యోగం ఇవ్వడం పట్ల ఆమె అభ్యంతరం తెలిపారు. ఈ విషయమై సభలో ప్రస్తావించాలని ఆమె స్పీకర్‌కు లేఖ అందించారు. రఘునాథ్‌రెడ్డి పాఠశాల విద్యాభ్యాసం అంతా కర్నూల్‌లోనే జరిగిందని, అతను తెలంగాణ వ్యక్తి కాకపోయినప్పటికీ 2007 జూలై 12న ఇచ్చిన జీవోను కోట్ చేస్తూ కారుణ్య నియామకం కింద ఉద్యోగం ఇవ్వడం దారుణమని పేర్కొన్నారు. అప్పటికి రాష్ట్రం కలిసే ఉందని, 2014 తర్వాత మన రాష్ట్ర అవసరాలకు తగ్గట్లుగా ఎన్నో నిబంధనలు మారాయని ఆమె చెప్పారు. అలాంటప్పుడు రఘునాథ్‌రెడ్డికి కంపాషనేట్ అపాయింట్‌మెంట్ ఎలా ఇస్తారని ప్రశ్నించారు. ఇది చాలా దారుణమని, తెలంగాణ ప్రాంత బిడ్డలకు ఉద్యోగాల్లో అన్యాయం జరిగితే పోరాటం చేస్తామని హెచ్చరించారు. కాంగ్రెస్ నాయకులు తెలంగాణ బిడ్డల పొట్ట కొట్టొద్దని కోరారు. ఈ సందర్భంగా అక్రమ నియామకం విషయాన్ని లేఖ రూపంలో మండలి చైర్మెన్ దృష్టికి తీసుకెళ్లారు. కవిత మాటలకు మంత్రి దామోదర రాజనర్సింహ వివరణ ఇస్తూ.. ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకున్నా నిబంధనలకు లోబడే ఉంటాయని, ఆ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు.

మీడియా పాయింట్

నదీ జలాల తీర్మానానికి మద్దతు

నదీజలాలపై ప్రభుత్వం ప్రవేశపెట్టిన తీర్మానాన్ని పూర్తిగా సమర్థిస్తున్నాం. కృష్ణా జలాల్లో రాష్ట్రానికి న్యాయమైన వాటా రావాలని కోరుకుంటున్నాం. కృష్ణా జలాల పంపిణీలో రాష్ట్రానికి జరిగిన అన్యాయం పట్ల మేము ఇదివరకే పలు మార్లు అభ్యంతరం తెలిపినం. కృష్ణా, గోదావరి నదులపై అనుమతులు లేకుండా నిర్మించిన ప్రాజెక్టుల ప్రస్తుత పరిస్థితి ఏమిటో తెలిపాలి. కర్నాటక నిర్మిస్తున్న ప్రాజెక్టులతోపాటు రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ స్కీంను నిలిపివేయాలి.

- అక్బరుద్దీన్ ఒవైసీ, ఎంఐఎం పక్షనేత

న్యాయమైన వాటాకోసం పోరాడాలి

కృష్ణా జలాల్లో న్యాయమైన వాటా సాధించుకునేందుకు పార్టీలకు అతీతంగా పోరాడాలి. కర్నాటక, తమిళనాడు రాష్ట్రాల్లో రాజకీయపార్టీల మధ్య ఎన్ని విభేదాలు ఉన్నా రాష్ట్రానికి అన్యాయం జరిగితే అంతా ఏకమవుతారు. అదేవిధంగా రాష్ట్రంలో కూడా నదీజలాల కోసం కలిసి పోరాడాలి. కేంద్రంతో సఖ్యతతో ఉంటూ సామరస్య ధోరణితో ముందుకు సాగాలి. పోతిరెడ్డిపాడు నిర్మాణంతోనే అన్యాయానికి బీజం పడింది. నాడు సీఎంగా ఉన్న రాజశేఖర్‌రెడ్డి 44 వేల క్యూసెక్కుల నీటిని తరలించుకున్నారు. పోతిరెడ్డిపాడు ద్వారా మొదలు 44 వేల క్యూసెక్కుల నుంచి ఇప్పటి సీఎం జగన్ 94 వేల క్యూసెక్కులు తరలించుకుపోతున్నారు. కృష్ణాజలాల్లో అన్యాయం జరగడం వల్ల మహబూబ్‌నగర్, నల్లగొండ, ఖమ్మం జిల్లాలు తీవ్రంగా నష్టపోతాయి. ప్రభుత్వం ప్రవేశపెట్టిన తీర్మానాన్ని సీపీఐ పూర్తిగా సమర్థిస్తున్నది.

- కూనంనేని సాంబశివరావు, సీపీఐ ఎమ్మెల్యే

అఖిలపక్షంగా ప్రధానిని కలుద్దాం

కృష్ణా జలాల్లో రాష్ట్రానికి న్యాయమైన వాటా సాధించేందుకు అన్ని పక్షాలు కలిసి ప్రధానిని కలిసి విజ్ఞప్తిచేద్దాం. ఉమ్మడి రాష్ట్రంలో అన్యాయం జరుగుతుందనే ఉద్దేశంతోనే నీటి వాటాకోసం ఉద్యమించినం. గత ఎనిమిదేండ్లుగా 299 టీఎంసీల నీటికి ఎందుకు ఒప్పుకొన్నారు? 2014 రాష్ట్ర పునర్విభజన చట్టంతో తెలంగాణకు నష్టం జరిగింది. 1956యాక్ట్ ప్రకారం అయితే నదీ జలాల్లో న్యాయం జరిగి ఉండేది. 2016లో అప్పటి ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు కేసీఆర్, చంద్రబాబునాయుడు ఒప్పుకొన్న విధంగానే నదీజలాల పంపిణీ జరిగింది. ఇప్పుడు ఆంధ్రా తరలించుకుంటున్న నీటిని ఏవిధంగా ఆపుతారో ముఖ్యమంత్రి తెలిపాలి.

- మహేశ్వర్‌రెడ్డి, బీజేపీ ఎమ్మెల్యే

సభ నుంచి మేడిగడ్డకు..

- అసెంబ్లీ వాయిదా వేసి కాళేశ్వరం యాత్ర
- నేడు అసెంబ్లీ 15 నిమిషాలే!
- ఈ నెల 14, 15 న సభ జరిగే అవకాశం?

హైదరాబాద్, ఫిబ్రవరి 12 (నమస్తే తెలంగాణ): శాసనసభ మంగళవారం సాంకేతికంగా ప్రారంభమైన 15 నిమిషాలకే వాయిదా పడనున్నది. ఆ తర్వాత శాసనసభ నుంచే ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు మేడిగడ్డ బరాజ్ (కాళేశ్వరం ప్రాజెక్టు) సందర్శనకు బయలుదేరుతారు. ఈ పర్యటనకు కోసమే మండలికి మంగళవారం విరామం ప్రకటించారు. శాసనసభ నుంచి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు మేడిగడ్డకు వెళ్లారన్న సాంకేతికత కోసమే సభ లాంఛనంగా సమావేశమై ఆ వెంటనే వాయిదా పడనున్నది. అసెంబ్లీ లాబీల్లో ఈ విషయాన్ని నీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి మీడియాకు వెల్లడించారు. శాసనసభ నిర్ణయం మేరకు సభ్యులు మేడిగడ్డ సందర్శన రికార్డుల్లో నమోదు కావడం కోసమే మంగళవారం సభ జరుగనుందని అధికారవర్గాల సమాచారం. ఎమ్మెల్యే మేడిగడ్డ పర్యటనపై మీడియాకు ప్రభుత్వం అధికారికంగా పంపించిన ఆహ్వానంలో కూడా ఇదే విషయాన్ని పేర్కొన్నది.

ఇటు నల్లగొండలో బీఆర్‌ఎస్ సభ.. అటు మేడిగడ్డలో మీడియా సమావేశం?

నల్లగొండ మంగళవారం బీఆర్‌ఎస్ సభ జరిగే సమయంలోనే మేడిగడ్డలో మీడియా సమావేశం నిర్వహించేలా ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం ఖరారు చేసింది. శాసనసభ నుంచి సీఎం, డిప్యూటీ సీఎంతో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఉదయం 10-15 గంటలకు మేడిగడ్డకు బయలుదేరుతారు. మధ్యాహ్నం 2 గంటలకు మేడిగడ్డకు చేరుకొని ప్రాజెక్టును సందర్శిస్తారు. అక్కడా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఉంటుంది. అది ముగిశాక 3 గంటలకు కాళేశ్వరం చేరుకుంటారు. అక్కడ మీడియా ప్రతినిధులతో సీఎం, నీటిపారుదల శాఖ మంత్రి మాట్లాడుతారని అధికారవర్గాల సమాచారం. రాష్ట్ర ప్రభుత్వం కృష్ణా పరీవాహక ప్రాంత ప్రాజెక్టులను కేఆర్‌ఎంబీకి అప్పగింతకు వ్యతిరేకంగా నల్లగొండలో నిర్వహించే బహిరంగ సభ ప్రారంభమయ్యే సమయంలోనే మేడిగడ్డలో ప్రభుత్వం మీడియా సమావేశం నిర్వహించేలా కార్యక్రమాన్ని ఖరారు చేసినట్టు తెలిసింది. వాస్తవానికి మేడిగడ్డకు తీసుకెళ్లే మీడియా బృందం ఉదయం 6:30 గంటలకే హైదరాబాద్ నుంచి బయలుదేరుతుంది. శాసనసభ నుంచి బయలుదేరిన ప్రజాప్రతినిధుల బృందం చేరుకునే దాకా వారు మేడిగడ్డ వద్దనే వేచి ఉండాలి. శాసనసభ్యుల బృందం సభ నుంచి ఆలస్యంగా బయలుదేరడానికి, సాయంత్రం 3 గంటల వరకు కాలయాపన చేయడానికి నల్లగొండలో బీఆర్‌ఎస్ సభ ప్రారంభం కోసమేనని తెలిసింది. నల్లగొండ సభ నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికే మేడిగడ్డ వద్ద అదే సమయంలో సీఎం, మంత్రుల బృందం మీడియా సమావేశం ఏర్పాటు చేసి ఉంటుందని రాజకీయ పరిశీలకులు అంచనా వేస్తున్నారు.

14, 15 రెండు రోజులపాటు సభ

శాసనసభలో ప్రవేశపెట్టిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌పై సభలో సోమవారం చర్చ జరగాల్సి ఉన్నది. అయితే సభలో నీటిపారుదల ప్రాజెక్టులపై ప్రభుత్వం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేసింది. దీనిపై ఉదయం నుంచి సాయంత్రం దాకా సభలో చర్చ జరగడంతో బడ్జెట్‌పై చర్చ కోసం ఈ నెల 14, 15 రెండు రోజులపాటు సభ జరిగే అవకాశం ఉంటుందని అధికారవర్గాల సమాచారం. ఈ నెల 14న మేడిగడ్డ సందర్శనపై సభలో చర్చ, 15వ బడ్జెట్‌పై చర్చ, ద్రవ్య వినిమయ బిల్లు ఆమోదం పొందే అవకాశం ఉన్నట్టు తెలిసింది.

లోకం పోకడ

అసలే గ్రూపులు.. రెండు స్టీరింగులు ఏర్పాటు చేసి పెట్టాం!

చలి వణుకు

	కనిష్ఠం	గరిష్ఠం
రంగారెడ్డి	16.9°c	36.2°c
ఖమ్మం	18.0°c	33.0°c
మెదక్	18.2°c	34.5°c
వరంగల్	19.0°c	32.0°c
కరీంనగర్	19.0°c	33.0°c
నల్లగొండ	19.4°c	33.1°c
ఆదిలాబాద్	19.6°c	36.0°c
హైదరాబాద్	20.1°c	32.3°c
మహబూబ్‌నగర్	20.1°c	34.4°c
నిజామాబాద్	20.7°c	34.0°c

సీఎం సార్.. మా సమస్యలను పట్టించుకోరూ!

సీఎం సార్.. తమ పాఠశాలలో నెలకొన్న టాయిలెట్లు, ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జోగుళాంబ గద్వాల జిల్లా గట్టు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థినులు సీఎం రేవంత్‌రెడ్డికి పోస్టు కార్డులు పంపారు. సోమవారం వారు పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ఆ పోస్టుకార్డులను ప్రదర్శించారు. *- గట్టు*

అమాయకుడ్ని కొట్టిచంపారు

- కిడ్నాపర్ అనుకుని విచక్షణారహితంగా దాడి
- దెబ్బలు తాళలేక చనిపోయిన పశువుల కాపరి
- నిజామాబాద్ జిల్లా కేంద్రంలో అమానుషం

వినాయకనగర్, ఫిబ్రవరి 12: అమాయకుడిని కిడ్నాపర్‌గా అనుమానించారు. అతడు చెప్పేది వినకుండా దారుణంగా కొట్టి చంపారు. పశువుల కాపరిపై ప్రతాపం చూపి ప్రాణం తీసిన అమానుష ఘటన నిజామాబాద్ జిల్లా కేంద్రంలో సోమవారం చోటుచేసుకున్నది. పోలీసులు, ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. నిజామాబాద్ మండల పరిధిలోని ఖానాపూర్‌కు చెందిన రాజు (50) కాపరి పశువులను మేతకు వదిలి చుట్టుపక్కల ప్రాంతాల్లో తిరుగుతుంటాడు. సోమవారం ఉదయం రాజు గాయత్రీనగర్ కాలనీకి వెళ్లాడు. అతడి వేషధారణ చూసి పిల్లలను కిడ్నాప్ చేసేందుకు వచ్చాడని స్థానికులు అనుమానించి దాడి చేయడంతో స్పృహ కోల్పోయాడు.

నిందితులపై కేసు నమోదు

డ్రెయినేజీలు తీసే కర్రలతో అతడ్ని లాక్కెళ్తుండగా చేతులు విరిగిపోయాయి. దాడి గురించి సమాచారం అందుకున్న ఫోర్త్ టౌన్ పోలీసులు అక్కడికి చేరుకుని బాధితుడ్ని దవాఖానకు తరలించారు. కానీ అప్పటికే రాజు మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. హత్య కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుల కోసం గాలిస్తున్నారు. బాధితుడిని చితకబాదుతున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో వాటి ఆధారంగా నిందితులను గుర్తించారు. ఇప్పటికే నలుగురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు మిగతా వారిని గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు.

నిజామాబాద్‌లో స్పృహ కోల్పోయిన వ్యక్తిని కర్రలతో ఈడ్చుకెళ్తున్న దృశ్యం

జూనియర్ డాక్టర్లకు గ్రీన్ చానెల్ ద్వారా వేతనాలు

- వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర సానుకూలత

హైదరాబాద్, ఫిబ్రవరి 12 (నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్‌రెడ్డి సూచన మేరకు జూనియర్ డాక్టర్లకు ప్రతి నెల గ్రీన్ చానెల్ ద్వారా వేతనాలు చెల్లించడానికి సానుకూలంగా ఉన్నామని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. సోమవారం తెలంగాణ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ (టీ-జూడా) ప్రతినిధులతో మంత్రి సమావేశమై పలు అంశాలమీద చర్చించారు. ఉస్మానియా దవాఖాన నూతన భవన నిర్మాణానికి, ఉస్మానియా మెడికల్ కాలేజీ ఆధునీకరణకు సానుకూలంగా ఉన్నట్టు మంత్రి పేర్కొన్నారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లోని జూనియర్ డాక్టర్ల హాస్టళ్లలో మౌలిక సదుపాయాల కల్పనపై నివేదిక సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సమావేశంలో టీ-జూడా అధ్యక్షుడు డాక్టర్ శ్రీహర్ష, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఇస్సాక్, ప్రతినిధులు డాక్టర్ మోరే వంశీకృష్ణ, డాక్టర్ దీపాంకర్, డాక్టర్ చంద్రికరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మానవాళికి 'ఏఎంఆర్' ముప్పు

- విచ్చలవిడి యాంటీ బయాటిక్స్ హానికరం
- డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ హెచ్చరిక

హైదరాబాద్, ఫిబ్రవరి 12 (నమస్తే తెలంగాణ): మానవాళికి 'యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్' (ఏఎంఆర్) ముప్పు పొంచి ఉన్నదని డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ (డీసీఏ) హెచ్చరించింది. అవసరం ఉన్నా లేకపోయినా విచ్చలవిడిగా యాంటీ బయాటిక్స్‌ను వాడితే వాటిని ఎదుర్కొనే సామర్థ్యాన్ని వ్యాధికారక సూక్ష్మజీవులు పొందుతాయని తెలిపింది. దీంతో అవి కలిగించే వ్యాధులు యాంటీ బయాటిక్స్‌కు కూడా లొంగని స్థాయికి చేరుకుంటాయని, వాటినే 'సూపర్ బగ్స్'గా పిలుస్తారని వివరించింది. ప్రస్తుతం ప్రజారోగ్య రంగం ఎదుర్కొంటున్న 10 ప్రధాన సమస్యల్లో ఏఎంఆర్ ఒకటని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) పేర్కొన్నది. ఏఎంఆర్ వల్ల అధిక ముప్పు పొంచి ఉన్న దేశాల్లో భారత్ ముందు వరుసలో ఉన్నట్టు వెల్లడించింది. ఏఎంఆర్ కారణంగా 2019లో ప్రపంచవ్యాప్తంగా 12.7 లక్షల మంది మరణించినట్టు తెలిపింది. దీన్ని నిలువరించడం కష్టమే అయినా ప్రజలు, ఆరోగ్య సిబ్బంది సహకరిస్తే సాధ్యమేనని డీసీఏ డీజీ కమలాసన్‌రెడ్డి చెప్పారు. అతిగా యాంటీ బయాటిక్స్ వాడితే పశువులు సైతం ఏఎంఆర్ స్థితికి చేరుకుంటాయని, వాటి ఉత్పత్తులను, మాంసాన్ని తినడం వల్ల మనుషులకు కూడా వ్యాపిస్తుందని తెలిపారు. హాస్పిటళ్లలో ఇన్ఫెక్షన్ కంట్రోల్ మెకానిజం సరిగా లేకపోవడం, పారిశుద్ధ్య నిర్వహణ లోపం వంటివి కూడా ఏఎంఆర్‌కు కారణమవుతాయని చెప్పారు. దీన్ని అందరూ దృష్టిలో పెట్టుకోవాలని, అతిగా యాంటీ బయాటిక్స్‌ను వాడొద్దని సూచించారు.

భువనతేజ ఇన్‌ఫ్రా ఎండీ అరెస్ట్

- ప్రీలాంచ్ ప్లాట్ల పేరిట భారీగా కుచ్చుటోపీ

హైదరాబాద్ సిటీబ్యూరో, ఫిబ్రవరి 12 (నమస్తే తెలంగాణ): కొనుగోలుదారుల నుంచి ప్రీ లాంచ్ స్కీమ్ పేరుతో కోట్ల రూపాయలు వసూలు చేసి, భారీ మోసానికి పాల్పడ్డ భువనతేజ ఇన్‌ఫ్రా ఎండీ చక్కా వెంకట సుబ్రమణ్యంను సీసీఎస్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఇబ్రహీంపట్నం, తుక్కుగూడ, శామీర్‌పేట్, సంగారెడ్డి తదితర ప్రాంతాల్లో ఓపెన్ ప్లాట్లు, అపార్టుమెంట్లను నిర్మిస్తానంటూ సుబ్రమణ్యం ప్రకటనలు ఇచ్చాడు. తక్కువ ధరకు ప్లాట్లు, ఫ్లాట్లు వస్తున్నాయని చాలామంది పూర్తి డబ్బులను చెల్లించారు. కాలం గడుస్తున్న ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేయకపోవడం, అపార్టుమెంట్లు నిర్మించకపోవడంతో తమ డబ్బు తిరిగి ఇవ్వాలని పలువురు కోరారు. తీసుకున్న డబ్బు తిరిగి ఇవ్వకపోవడం, ప్లాట్లు, ఫ్లాట్లకు రిజిస్ట్రేషన్ చేయకపోవడంతో బాధితులు సీసీఎస్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేసిన పోలీసులు సోమవారం నిందితుడిని అరెస్ట్ చేశారు. శామీర్‌పేట్‌లో హ్యాపీ హోమ్స్ పేరిట నిర్మించిన ప్రాజెక్టులో కొనుగోలుదారుల నుంచి రూ.2.29 కోట్లు వసూలు చేసి.. ఫ్లాట్లను ఇవ్వకుండా, కనీసం డబ్బులు తిరిగి ఇవ్వకుండా దాదాపు 400 మందిని మోసం చేశాడని అందిన ఫిర్యాదుల మేరకు నిందితుడిని అరెస్టు చేశామని జాయింట్ సీపీ ఏవీ రంగనాథ్ వెల్లడించారు.

అకౌంట్ ఆఫీసర్ తుది కీ విడుదల

హైదరాబాద్, ఫిబ్రవరి 12 (నమస్తే తెలంగాణ): మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ డిపార్ట్‌మెంట్‌లో అకౌంట్స్ ఆఫీసర్ ఉద్యోగాలకు సంబంధించిన ఫైనల్ 'కీ'ని టీఎస్‌పీఎస్సీ సోమవారం విడుదల చేసింది. తుది కీ వివరాలను https://www.tspsc.gov.in వెబ్‌సైట్‌లో పొందుపరిచామని తెలిపింది. రాష్ట్రంలో 78 అకౌంట్స్ ఆఫీసర్ ఉద్యోగాల భర్తీకి నిరుడు ఆగస్టు 8న కంప్యూటర్ బేస్డ్ రిక్రూట్‌మెంట్ టెస్ట్(సీబీఆర్టీ) పద్ధతిన పరీక్ష నిర్వహించిన విషయం తెలిసిందే.

గెజిటెడ్, నాన్ గెజిటెడ్ ఉద్యోగాల కీ వెల్లడి

రాష్ట్ర భూగర్భ జలశాఖలో గెజిటెడ్, నాన్ గెజిటెడ్ ఉద్యోగాల తుది 'కీ'ని టీఎస్‌పీఎస్సీ సోమవారం విడుదల చేసింది. ఈ తుది కీని https: //www.tspsc.gov.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామని కమిషన్ తెలిపింది. నిరుడు జూలై 18, 19, 20, 31 తేదీల్లో సీబీఆర్టీ పద్ధతిలో పరీక్ష నిర్వహించిన విషయం తెలిసిందే.

ఉద్యోగ వయోపరిమితి రెండేండ్లు పెంపు

హైదరాబాద్, ఫిబ్రవరి 12 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి వయో పరిమితిని రాష్ట్ర ప్రభుత్వం మరో రెండేండ్లు పెంచింది. ఈ మేరకు సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో ఉద్యోగ వయోపరిమితి 34 ఏండ్లు ఉండేది. అయితే.. యువత కు ఉద్యోగావకాశాల్లో మరిం త అవకాశం కల్పించాలనే సదుద్దేశంతో కేసీఆర్ ప్రభు త్వం ఉద్యోగ వయోపరిమితిని 44 ఏండ్ల వరకు పెం చింది. ప్రస్తుత ప్రభుత్వం దానిని మరో రెండేండ్లు పొడిగించింది.

కులాలు/ క్యాటగిరీల వారీగా అభ్యర్థుల గరిష్ఠ వయోపరిమితి

కులం	గతం	ప్రస్తుతం
ఓసీ	44	46
ఎస్సీ, ఎస్టీ, బీసీ	49	51
దివ్యాంగులు	54	56
మాజీ సైనికోద్యోగులు	47	49

జేఈఈ మెయిన్-1లో ఆరు ప్రశ్నల ఉపసంహరణ

- తుది కీ విడుదల చేసిన ఎన్టీఏ

హైదరాబాద్, ఫిబ్రవరి 12 (నమస్తే తెలంగాణ): జేఈఈ మెయిన్ -1 పరీక్షల్లో ఆరు ప్రశ్నలను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) ఉపసంహరించింది. ప్రశ్నల్లో లోపాల కారణంగా ఆయా ప్రశ్నలను తొలగించింది. అయితే ఇవి ఒకే సెషన్‌లో కాకుండా వివిధ సెషన్లలో ఉన్నాయి. తొలగించిన ఆరు ప్రశ్నలు ఆబ్జెక్టివ్ టైపు ప్రశ్నలే కావడం విశేషం. జేఈఈ మెయిన్ -1 పరీక్షలను జనవరి 24 నుంచి ఫిబ్రవరి 1 వరకు నిర్వహించిన విషయం తెలిసిందే. జనవరి 27న రెండోషిఫ్ట్‌లో, 29న మొదటి షిఫ్ట్‌లో, 30, 31న రెండోషిఫ్ట్‌లో ఒకటి చొప్పున మొత్తం నాలుగు ప్రశ్నలు, ఫిబ్రవరి 1న రెండో షిఫ్ట్‌లో రెండు ప్రశ్నలను ఉపసంహరించారు. దీంతో మొత్తం మీద ఆరు ప్రశ్నలను ఎన్టీఏ తొలగించింది. ఇక మరో 16 ప్రశ్నలకు ప్రాథమిక 'కీ'లో ఇచ్చిన సమాధానాలను ఫైనల్ 'కీ'లోకి మార్చింది. ఈ 'కీ'లో మార్పులు చేసిన ఫలితంగా పలువురు విద్యార్థులు ఒకటి రెండు మార్కుల తేడాతో 300కు 300 వచ్చే మార్కులను కోల్పోయారు.

సబ్జెక్టు	'కీ'లో మార్పులు	తొలగించిన ప్రశ్నలు
గణితం	02	03
ఫిజిక్స్	04	03
కెమిస్ట్రీ	03	02

మరో ప్రశ్నకు రెండు ఆన్సర్లు సరైనవిగా తేల్చారు.

ఐఎస్‌బీ దేశంలోనే నంబర్ వన్

- ఎఫ్‌టీ గ్లోబల్ ఎంబీఏ ర్యాంకింగ్స్‌లో టాప్
- గ్లోబల్ ర్యాంకింగ్స్‌లో 39 నుంచి 31వ స్థానానికి ఎగబాకిన ఐఎస్‌బీ

హైదరాబాద్, ఫిబ్రవరి 12 (నమస్తే తెలంగాణ): ప్రపంచ అగ్రశ్రేణి విద్యాసంస్థ, హైదరాబాద్‌లోని ఇండియన్ బిజినెస్ స్కూల్ (ఐఎస్‌బీ) దేశంలోనే నంబర్ వన్ స్థానంలో నిలిచింది. సోమవారం విడుదలైన ఫైనాన్షియల్ టైమ్స్ (ఎఫ్‌టీ) గ్లోబల్ ఎంబీఏ ర్యాంకింగ్-2024లో దేశంలోనే టాప్-1 స్థానాన్ని నిలబెట్టుకున్నది. గ్లోబల్ ర్యాంకింగ్స్‌లో 31వ స్థానాన్ని కైవసం చేసుకున్నది. నిరుడు అంతర్జాతీయ ర్యాంకింగ్స్‌లో 39వ ర్యాంక్‌లో నిలవగా, ఈ సారి తన స్థానాన్ని మెరుగుపరుచుకుని 31వ స్థానానికి ఎగబాకింది. 229 శాతం పెరుగుదలతో వార్షిక వేతన పెరుగుదల అంశంలో అంతర్జాతీయంగా నంబర్ వన్ స్థానంలో నిలిచింది. రీసెర్చ్ ర్యాంకింగ్‌తోపాటు అలుమ్ని, పోస్ట్ పీజీపీ వేతనాలపరంగానూ అత్యుత్తమ ప్రతిభను కనబరిచింది. గ్లోబల్ రీసెర్చ్ ర్యాంకింగ్స్‌లో 52వ స్థానంలో నిలిచింది. అలుమ్ని నెట్‌వర్క్‌లో దేశంలో టాప్- బీ స్కూల్‌గా నిలవడమే కాకుండా, ఈ విషయంలో అంతర్జాతీయంగా 8వ ర్యాంక్ పొందింది.

ఐఐఎం అహ్మదాబాద్ రెండో ర్యాంక్

ఐఐఎం అహ్మదాబాద్ జాతీయంగా రెండో ర్యాంక్, అంతర్జాతీయంగా 41వ ర్యాంక్, ఐఐఎం బెంగళూరు మూడోర్యాంక్, 47, ఐఐఎం కోల్‌కత్తా జాతీయంగా మూ డు, అంతర్జాతీయంగా 67, ఐఐఎం లక్నో జాతీయంగా నాలుగు, అంతర్జాతీయంగా 85, జేవియర్ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ జాతీయంగా ఐదో, అంతర్జాతీయంగా 99వ ర్యాంకులను కైవసం చేసుకున్నాయి. యూనివర్సిటీ ఆఫ్ పెన్సిల్వేనియా, ప్రాన్సిస్, కొలంబియా బిజినెస్ స్కూల్ (యూఎస్), ఎస్‌డీఏ బకోని, ఐఈఎస్‌ఈ బిజినెస్ స్కూల్స్ వరుసగా వరల్డ్ టాప్ -5 బిజినెస్ స్కూల్స్‌లో జాబితాలో చోటు దక్కించుకున్నాయి.

ఈఎన్సీ మురళీధర్‌రావు రాజీనామా ఆమోదం

హైదరాబాద్, ఫిబ్రవరి 12 (నమస్తే తెలంగాణ): తెలంగాణ రాష్ట్ర నీటిపారుదలశాఖ ఈఎన్సీ (జనరల్) మురళీధర్‌రావు రాజీనామాను రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించింది. ఈ మేరకు సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈఎన్సీ (జనరల్) పోస్టుకు అర్హులను ప్రతిపాదించాలని ఈఎన్సీ అడ్మిన్ అనిల్‌కుమార్‌ను ప్రభుత్వం ఆదేశించింది.

ఈ ఏడాది 56 మంది ఇంజినీర్లు ఉద్యోగ విరమణ

హైదరాబాద్, ఫిబ్రవరి 12 (నమస్తే తెలంగాణ): ఈ ఏడాది రాష్ట్ర సాగునీటి పారుదలశాఖలో మొత్తం 56 మంది ఇంజినీర్లు ఉద్యోగ విరమణ పొందనున్నారు. అందుకు సంబంధించిన ఉద్యోగుల జాబితాను నీటిపారుదలశాఖ కార్యదర్శి రాహుల్‌బొజ్జా సోమవారం విడుదల చేశారు. ఈఎన్సీతోపాటు, నలుగు రు సీఈలు, 22 మంది ఎస్‌ఈలు, 19 మంది ఈఈలు, 10 మంది డీఈఈలు ఉన్నట్టు తెలిపారు.

శివబాలకృష్ణ బెయిల్ పిటిషన్ కొట్టివేత

- ఐఏఎస్‌లకు ఏసీబీ నోటీసులు

నాంపల్లి కోర్టులు, ఫిబ్రవరి 12 (నమస్తే తెలంగాణ): అక్రమాస్తుల కేసులో హెచ్‌ఎండీఏ మాజీ డైరెక్టర్ శివబాలకృష్ణకు చుక్కెదురైంది. బెయిల్ కోసం ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను ఏసీబీ కోర్టు జడ్జి మహ్మద్ అఫ్రోజ్ అక్తర్ సోమవారం కొట్టివేశారు. ఈ కేసులో సాక్షులుగా కొందరు ఐఏఎస్ అధికారులను విచారించేందుకు ఏసీబీ అధికారులు సిద్ధమవుతున్నారు. శివబాలకృష్ణ కస్టోడియల్ విచారణ సందర్భంగా ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్ పేరు తెరపైకి రావడంతో ఆయనతో పాటు మరికొందరు ఐఏఎస్‌లకు సీఆర్పీసీలోని సెక్షన్ 160 కింద నోటీసులు జారీచేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

నుమాయిష్ 3 రోజులు పొడిగింపు

అబిడ్స్, ఫిబ్రవరి 12: నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో కొనసాగుతున్న నుమాయిష్‌ను మరో మూడు రోజులు పొడిగిస్తున్నట్టు ఐటీ శాఖ మంత్రి, ఎగ్జిబిషన్ సొసైటీ అధ్యక్షుడు డీ శ్రీధర్‌బాబు ప్రకటించారు. సోమవారం రాత్రి ఎగ్జిబిషన్ మైదానంలో పలు ప్రభుత్వ శాఖల అధికారులు, స్టాల్ హోల్డర్లకు ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్‌తో కలిసి బహుమతులను ప్రదానం చేశారు. స్టాల్ నిర్వాహకుల విజ్ఞప్తి మేరకు 18 వరకు నుమాయిష్ కొనసాతుందని మంత్రి శ్రీధర్‌బాబు చెప్పారు. నుమాయిష్ ద్వారా వేల మందికి ఉపాధి లభిస్తున్నదని మంత్రి జూపల్లి తెలిపారు.

సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో నినాదాలు చేస్తున్న రైతులు

ఐఎంఆర్ ఆగ్రో వెట్ వ్యర్థాలతో అంతుచిక్కని వ్యాధులు

- పాడి పశువుల మృత్యువాత
- ఫ్యాక్టరీ మూసివేతకు స్థానికుల విజ్ఞప్తి

ఖైరతాబాద్, ఫిబ్రవరి 12: రంగారెడ్డి జిల్లా మాడుగుల మండలం అప్పిరెడ్డిపల్లి శివారులోని ఐఎంఆర్ ఆగ్రో వెట్ ఫ్యాక్టరీ నుంచి వెలువడుతున్న వ్యర్థాలు, దుర్వాసనతో తీవ్ర సమస్యలు ఎదురవుతున్నాయని ఆ చుట్టుపక్క గ్రామాల ప్రజలు వాపోతున్నారు. బాధితులు రమేశ్ నాయక్, మల్లేశ్, కే బాలు, నరసింహ, మాజీ సర్పంచ్ జంగయ్య తదితరులు సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశం నిర్వహించి తమ గోడును వెళ్లబోసుకున్నారు. జంతువుల కళేబరాలతో ఆ ఫ్యాక్టరీలో నూనెలు, పొడులను తయారు చేస్తుండటం వల్ల గాలి, నీరు కలుషితమై తమ జీవితాలు దుర్భరంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. తమ ప్రాంతంలో ఇప్పటికే అనేక పాడిపశువులు మృతి చెందాయని, అంతు చిక్కని రుగ్మతలతో దాదాపు 30 మంది దవాఖానల్లో చికిత్స పొందుతున్నారని వివరించారు. దీనిపై జిల్లా కలెక్టర్‌తోపాటు పోలీస్, పీసీబీ అధికారులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని చెప్పారు.

బాలకృష్ణ ఆస్తుల రిజిస్ట్రేషన్ నిలిపేయండి

- కుటుంబసభ్యుల పేరునా భూముల కొనుగోలు
- 22 మంది వ్యక్తుల భూములు ఫ్రీజ్ చేయండి
- కలెక్టర్ హన్మంతు జెండగేకు ఏసీబీ లేఖ

యాదాద్రి భువనగిరి, ఫిబ్రవరి 12 (నమస్తే తెలంగాణ): హెచ్‌ఎండీఏ మాజీ డైరెక్టర్, మెట్రో రైల్ చీఫ్ జనరల్ నేనేజర్ శివ బాలకృష్ణ అక్రమాస్తుల కేసులో సీఆర్‌పీసీ 91 సెక్షన్ ప్రకారం ఆయన ఆస్తుల వివరాలు సమర్పించాలని, ప్రివెన్షన్ ఆఫ్ కరప్షన్ యాక్ట్ 1988 ప్రకారం సదరు భూముల రిజిస్ట్రేషన్‌ను నిలిపేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్‌ను ఏసీబీ కోరింది. ఈ మేరకు ఈ నెల 9న కలెక్టర్ హన్మంతు కే జెండగేకు ఏసీబీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఈశ్వర్‌రావు లేఖ రాశారు. ప్రివెన్షన్ ఆఫ్ కరప్షన్ యాక్ట్-1988 ప్రకారం శివ బాలకృష్ణపై అక్రమాస్తుల కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని లేఖలో పేర్కొన్నారు. శివ బాలకృష్ణతోపాటు ఆయన కుటుంబసభ్యుల పేరుతో భూములు కొన్నారని తెలిపారు. వలిగొండ మండలం నర్సాపూర్‌లో ఎస్ హరి ప్రసాద్ పేరున 8 ఎకరాలు, ఎస్ రఘుదేవిపై 11.03 ఎకరాలు, వలిగొండ మండలంలోని చిత్తాపూర్‌లో ఎస్ పద్మావతి పేరున 3.31 ఎకరాలు, బీబీనగర్ మండలంలోని చిన్నరావులపల్లిలో ఎస్ అరుణ పేరున 0.20 ఎకరాలు, మోత్కూరు మండలం పాలడుగులో వివిధ సర్వే నంబర్లలో ఎస్ నవీన్ పేరున 27.8 1/2 ఎకరాలు, వలిగొండ మండలంలోని రెడ్లరేపాడులో వివిధ సర్వే నంబర్లలో శివకుమార్ పేరున 14.85 ఎకరాల భూములు ఉన్నాయని వివరించారు. తాము పొందుపరిచిన 22 మందికి సంబంధించిన ధరణి పోర్టల్, ఇతర ఆఫీస్ రికార్డుల్లో ఎలాంటి ఆస్తులు రిజిస్టర్ అయినా వాటిని సైతం రిజిస్ట్రేషన్లు జరుగకుండా ఫ్రీజ్ చేయాలని సూచించారు.

పునఃపరిశీలన, తిరస్కరణ వేర్వేరు

- ఎమ్మెల్సీల కేసులో హైకోర్టు వ్యాఖ్య
- తదుపరి విచారణ రేపటికి వాయిదా

హైదరాబాద్, ఫిబ్రవరి 12 (నమస్తే తెలంగాణ): గవర్నర్ కోటాలో ప్రొఫెసర్ కోదండరాం, 'సియాసత్' పత్రిక ఎడిటర్ అమీర్ అలీఖాన్‌ను ఎమ్మెల్సీలుగా నియమించడాన్ని సవాలు చేస్తూ బీఆర్‌ఎస్ నాయకులు దాసోజు శ్రవణ్, కుర్రా సత్యనారాయణ దాఖలు చేసిన పిటిషన్లపై సోమవారం హైకోర్టులో విచారణ జరిగింది. మంత్రివర్గ సిఫారసులకు గవర్నర్ కట్టుబడి ఉండాలని, అయితే ఆ సిఫార్సులను పరిశీలించే విచక్షణాధికారం గవర్నర్‌కు ఉంటుందని ప్రతివాదుల తరఫు న్యాయవాది అవినాశ్ దేశాయ్ వాదించారు. ఎమ్మెల్సీలుగా దాసోజు శ్రవణ్, కుర్రా సత్యనారాయణను నియమించాలంటూ గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో మంత్రివర్గం చేసిన సిఫారసును గవర్నర్ తిరస్కరించారని, ఆ తర్వాత బీఆర్‌ఎస్ మంత్రివర్గం మళ్లీ అవే పేర్లను పునఃపరిశీలించాలని సిఫారసు చేసి ఉంటే గవర్నర్ ఆమోదించి ఉండేవారని చెప్పారు. కోదండరాం, అలీఖాన్ పేర్లను గత డిసెంబర్‌లో మంత్రివర్గం ఆమోదించిందని, ఎమ్మెల్సీలుగా నియమించేందుకు కావాల్సిన అన్ని అర్హతలు వారికి ఉన్నాయని అన్నారు. ఎమ్మెల్సీలుగా నియమితులైన వారికి అర్హతలు ఉన్నా, లేకపోయినా వారి నియామక జీవోలను సవాలు చేయవచ్చని, అలా కాకుండా తమను ఎమ్మెల్సీలుగా నియమించాలని కోరే హక్కు ఎవరికీ ఉండదని తెలిపారు. మంత్రి మండలి, గవర్నర్ల కంటే రాజ్యాంగం అత్యున్నతమైనదని చెప్పారు. గవర్నర్ విచక్షణాధికారాలపై న్యాయ సమీక్షకు ఆస్కారం లేదని సుప్రీంకోర్టు ఇప్పటికే పలు సందర్భాల్లో స్పష్టం చేసిందని గుర్తుచేశారు. దీంతో మంత్రివర్గ సిఫారసులను తిరస్కరించడం, పునఃపరిశీలించడం వేర్వేరని హైకోర్టు వ్యాఖ్యానించింది. ఈ అంశంపై తమ వాదన వినిపించేందుకు గడువు కావాలని పిటిషనర్ల తరఫు న్యాయవాది కోరడంతో విచారణ ఈ నెల 14కు వాయిదా పడింది.